సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 19 । జనవరి । 2025



ఆరోగ్య ఆసరాకు మంగళం..!
కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ), ఆరోగ్య ఆసరా పథకాలపై నిర్లక్ష్యం అలముకుంది. - 8లో



ఇరు వర్గాల ఘర్షణలో పది మందికి గాయాలు - 8లో
దత్తిరాజేరు మండలం చినచామలాపల్లిలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పది మంది గాయపడ్డారు.



కేజీంపావు బంగారం కొట్టేశారు
ఓ ఇద్దరు దొంగలు ఏడాది వ్యవధిలో గుట్టుచప్పుడుగా కేజీంపావు బంగారాన్ని దోచుకున్నారు. చివరకు పోలీసులకు చిక్కారు. - 8లో

న్యూస్‌రీల్

ఇరిగేషన్ ఎస్ఈగా అప్పారావు

బొబ్బిలి: బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరుగా ఆర్.అప్పారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చిన రాజరాజేశ్వరీ దేవి కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీ అయ్యారు. ఆ తరువాత ఇక్కడ ఎవరినీ నియమించలేదు. నార్త్ కోస్ట్ సీఈ ఎస్.సుగుణాకర రావు ఎస్ఈ బాధ్యతలు చూస్తున్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- 86.81 శాతం మంది హాజరు



సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 6,207 మంది దరఖాస్తు చేయగా 86.81 శాతంతో 5,381 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను 32 మంది ముఖ్య పర్యవేక్షకులు, 32 మంది పరిశీలకులు పర్యవేక్షించగా, 291 మంది ఇన్విజిలేటర్లుగా పనిచేశారని డీఈఓ యు.మాణిక్యం నాయుడు తెలిపారు.

రేపటి నుంచి పశు వైద్య శిబిరాలు

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలను నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు తన చాంబర్‌లో శిబిరాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. రైతులందరూ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరాల్లో సాధారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



కలిసిరాని జీడి పంట

- ఓ వైపు మంచుతో పంటకు నష్టం
- మరోవైపు పంటకు గిట్టుబాటు ధర కరువు
- బయట మార్కెట్‌లో కిలో జీడిపిక్కల ధర రూ.180
- గిరిజన రైతులకు చెల్లిస్తున్నది కిలోకు రూ.100 నుంచి రూ.120
- క్వింటా పిక్కలు రూ.18వేలకు కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

సాక్షి, పార్వతీపురం మన్యం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా దన్నుగా నిలిచేది జీడి పంటే. కొంతకాలంగా జీడిపిక్కలకు మార్కెట్ ధర లేకపోవడం.. పిందె దశలో వర్షాలకు తేనెమంచు ప్రభావం వల్ల పంట దెబ్బతినడం, పిందె రాలి పోవడం వంటి కారణాల వల్ల గిరిజన రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. జీడి పిక్కలకు కనీస మద్దతు ధర చెల్లించాలని కొన్నాళ్లుగా రైతులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. జిల్లాలో దాదాపు 65 వేల ఎకరాల్లో జీడి తోటలు సాగులో ఉన్నాయి. 30 వేల మంది రైతులు వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క సీతంపేట ఏజెన్సీలోనే సుమారు 25 వేల హెక్టార్ల వరకు ఏటా సాగవుతోంది. సాధారణంగా జీడి పంట డిసెంబర్‌లో పూత దశకు వస్తుంది.

ప్రకటనలకే ప్రాసెసింగ్ యూనిట్లు

జీడి పిక్కల ద్వారా మంచి ఆదాయం పొందేలా ఐటీడీఏల పరిధిలో ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాలని అధికారులు తరచూ ప్రకటనలైతే చేస్తున్నారు గానీ.. ఆచరణలోకి రావడం లేదు. జీడిపప్పు మార్కెటింగ్‌లో రైతులు దళారుల బారిన పడకుండా వన్‌ధన్ వికాస్ కేంద్రాల ద్వారా మంచి ధర కల్పించేలా చూడాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరుల్లో యూనిట్లను స్థాపించనున్నట్లు చెబుతున్నారు. ఇవన్నీ ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. గిరిజన రైతులకు మేలు చేసేందుకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో గతంలో ఏడు జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. గిరిజన మండలాల పరిధిలోని మహిళా సంఘాల ద్వారా సుమారు రూ.15 లక్షలు వెచ్చించి వీటిని నెలకొల్పారు. ఈ యూనిట్ల ద్వారా గిరిజనులే నేరుగా జీడి పిక్కలు తీసుకువచ్చి, వారే జీడి పప్పును మార్కెట్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కడా పూర్తిస్థాయిలో పని చేయని పరిస్థితి ఉంది. దీనికితోడు యూనిట్ల స్థాపనలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలను వెలుగు అధికారులు మూటగట్టుకున్నారు.

ఆదుకోని యంత్రాంగం..

జిల్లాలోని సీతంపేట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు తదితర ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు జీడి తోటలపైనే చాలా ఏళ్లుగా బతుకుతున్నారు. ప్రస్తుతం జీడి పిక్కల ధర మార్కెట్లో కిలో రూ.180 వరకు ఉంది. గిరిజనులకు పంట చేతికందేసరికి దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారుతున్నారు. జీడి పిక్కలను కిలో రూ.100 నుంచి రూ.120లోపే కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులకు పెట్టుబడి కూడా దక్కడం లేదు. వరి, మొక్కజొన్న, పత్తి మాదిరి జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని రైతు, ప్రజాసంఘాలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. క్వింటా పిక్కలు రూ.18 వేల చొప్పున జీసీసీ కొనుగోలు చేయాలని కోరుతున్నాయి. ఆ దిశగా చర్యలు కానరావడం లేదు.

జీసీసీ ద్వారా కొనుగోలు చేయాలి

జీడిపిక్కలను క్వింటా రూ.18 వేలు చొప్పున జీసీసీ కొనుగోలు చేయాలి. తక్షణమే జీడి ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించి, అక్కడ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా గిరిజనులు జీడితోటలపైనే ఆధారపడుతున్నారు. పంట పండకపోయినా, ధర లేకపోయినా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కొల్లి గంగునాయుడు, వి.రమణ, సీపీఎం నాయకులు

స్వచ్ఛ మన్యం దిశగా అడుగులు





శిక్షణలో పాల్గొన్న ట్రైనీలు (ఇన్‌సెట్లో) శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: స్వచ్ఛ ఆంధ్రా దిశగా అడుగులు వేస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి జట్టు సంస్థ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం మన్యం జిల్లా మాస్టర్ ట్రైనీస్ శిక్షణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రా–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను 80 రోజులపాటు గ్రామాల్లో ప్రత్యక్షంగా అమలు చేయాలన్నారు. ఏపీ స్వచ్ఛ రాష్ట్ర సలహాదారు శ్రీనివాసచార్యులు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం దినేష్ రెడ్డి, సెట్విజ్ సీఈఓ ఎస్.రామ్‌గోపాల్, జట్టు ట్రస్టీ డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛ గ్రామాల నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. జట్టు భావసమాఖ్య ఆశ్రమ నిర్వాహకులు పద్మజ, డీఎండబ్ల్యూఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు శాంతి, జట్టు సిబ్బంది, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై పెదకుదమ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జియ్యమ్మవలస: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని పెదకుదమ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను పరిశుభ్రమైన జిల్లాగా మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రదేశాలను పరిశుభ్రం చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. తడి, పొడిచెత్తను వేరుచేసి ఎప్పటికప్పుడు పురపాలక సిబ్బందికి అందజేయాలన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛ పరిసరాలను అందించే లక్ష్యంతో పనిచేయాలని కోరారు. గ్రామంలోని పారిశుద్ధ్యం, కాలువలు, తాగునీటి పైపులైన్లు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రరావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వర్ధంతి సభా? విజయోత్సవ ర్యాలీయా?



సాలూరు పట్టణంలో ఓపెన్ టాప్ కారులో మంత్రి గుమ్మడి సంధ్యారాణి పార్టీ జెండాలు ఊపుతూ శనివారం ముందుకు సాగడాన్ని చూసిన స్థానికులు తొలుత విజయోత్సవ ర్యాలీ అని భ్రమపడ్డారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున మంత్రి ఇలా ముందుకు సాగారన్న విషయం తెలుసుకుని విస్తుపోయారు. వర్ధంతిని సైతం పండగలా భావించడాన్ని చూసి ఆ పార్టీ నాయకులే కొందరు గుసగుసలాడారు. అమర్ రహే అనాల్సింది పోయి విజయహాసం ప్రదర్శించడాన్ని తప్పుబట్టారు. టీడీపీ వ్యవస్థాపకుడు మరణించిన రోజున సంతాపాలు తెలిపి, ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకోవాల్సింది పోయి ఇలా సంతోషంగా విజయోత్సవ ర్యాలీ మాదిరిగా ముందుకు సాగడంపై విమర్శలు వెల్లువెత్తాయి. - సాలూరు

జాతర ఏర్పాట్లలో నిర్లక్ష్యం తగదు



శంబరలో పర్యటిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీవాస్తవ

- జాతర పనులు పరిశీలించిన సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్
- పీఆర్ జేఈ తీరుపై మండిపాటు

మక్కువ: జాతర సమయం ఆసన్నమైంది.. వనం గుడి వద్ద పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి.. పనులు దగ్గరుండి పరిశీలించాల్సిన పీఆర్ జేఈ గైర్హాజరుకావడంపై సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్ మండిపడ్డారు. అధికారుల్లో ఇంత నిర్లక్షదోరణి ఉంటే సరికాదని హెచ్చరించారు. శంబర గ్రామంలో పోలమాంబ జాతర ఏర్పాట్లను ఆయన శనివారం పరిశీలించారు. గ్రామంలో సిరిమాను తిరిగే ప్రదేశాల్లో చేపట్టే పనులను పర్యవేక్షించారు. వీధుల్లోని కాలువలపై నడిచే భక్తులు ప్రమాదాలకు గురికాకుండా పలకలు అమర్చాలని సూచించారు. భక్తులు రాకపోకలు సాగించే వీధుల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చివేయాలన్నారు. చదురు గుడి సమీపంలోని మరుగుదొడ్ల చుట్టూ కాంక్రీటు నిర్మాణం జరిపించాలన్నారు. అవసరమైతే నూతనంగా మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలిగితే సహించేదిలేదన్నారు. జాతరలో తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ నెల 24న మరోసారి పనులు పరిశీలించేందుకు గ్రామానికి వస్తానని, అప్పటిలోగా 80 శాతం పనులు పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. క్యూల ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని దేవదాయశాఖ అధికారులకు సూచించారు. గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్లలో విద్యుత్‌లైట్లు వేయాలన్నారు. పోలమాంబ అమ్మవారి సిరిమానోత్సవానికి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందని, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.డి.స్వరూపరాణి, తహసీల్దార్ షేక్‌ఇబ్రహీం, ఈఓ వి.వి.సూర్యనారాయణ, అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైద్యం కోసం వెళ్తూ.. మృత్యు ఒడికి

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బస్సు
- తండ్రి, కుమార్తెల దుర్మరణం
- 16 మందికి గాయాలు
- మిన్నంటిన హాహాకారాలు

చిన్నారికి శస్త్ర చికిత్స చేయించాలని ఓ కుటుంబం... వృద్ధులకు వైద్యపరీక్షలు చేయించాలని మరికొందరు... ఇలా సుమారు 40 మంది ఆస్పత్రి బస్సులో పయనమయ్యారు. మరికాసేపట్లో ఆస్పత్రికి చేరుకుంటారన్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదం వారిలో కుదుపురేపింది. ఓ కుటుంబానికి చెందిన తండ్రి, కుమార్తెను మృత్యువు కాటేసింది. ఆస్పత్రికి వెళ్లకుండానే అనంతలోకాలకు తీసుకుపోయింది.



మృతి చెందిన తండ్రీ కూతురు (ఫైల్‌ఫొటో)

గజపతినగరం/మల్కన్‌గిరి: ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి ఎం.వి–58 గ్రామం, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 40 మంది అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ బస్సులో వైద్యసేవల కోసం శుక్రవారం రాత్రి బయలుదేరారు. శనివారం ఉదయానికి ఆస్పత్రికి చేరుకుంటామని అంతా భావించారు. ఇంతలోనే విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మధుపాడ పాలదారి చెరువు వద్ద ఆగి ఉన్న లారీని బస్సు బలంగా ఢీకొట్టింటి. అంతే... ఆ ప్రాంతం హాహాకారాలతో మిన్నంటింది. బస్సులో ఉన్నవారంతా చెల్లాచెదురుగా పడ్డారు. ప్రమాదంలో 16 మంది గాయపడగా, వీరిలో తండ్రి, కుమార్తెలు సుబ్రత్‌రాయ్(35), మోహత్ రాయ్ (మూడున్నరేళ్లు) దుర్మరణం చెందారు. సుబ్రత్ రాయ్ తన కుమార్తెకు బీఎస్‌కేవై (బిజు స్వాస్థ్య కల్యాణ్ యోజన) పథకం కింద అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయించేందుకు బయలుదేరగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కళ్ల ముందే విగతజీవులుగా మారిన భర్త, కుమార్తెను చూసి మీరా సర్కార్ బోరున విలపించింది. ఆమె స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడింది. గాయపడిన ఎనిమిది మందిని వైద్యసేవల కోసం గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, మిలిలిన వారిని అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల, పోడియా సమితి పరిధిలోని గ్రామాల ప్రజలను గతంలోనూ ఇలా బస్సుల్లో తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్స చేయించేవారని గ్రామస్తులు తెలిపారు. ఈ సారి బస్సులో వెళ్తే ప్రమాదానికి గురికావడంతో ఆయా గ్రామాల్లో విషాదం అలముకుంది. ఎస్ఐ కె.లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ అప్పారావును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కవోని ఆసక్తి..!

- మొక్కల పెంపకంపై ప్రజల ఆసక్తి
- అందుబాటులోకి నర్సరీలు
- రూ.10 నుంచి మొక్కల ధరలు
- తులసి నుంచి మనీ మొక్క వరకు అమ్మకం
- కడియం నుంచి తెప్పిస్తున్న మొక్కలు



పాలకొండలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల పూల మొక్కలు

పాలకొండ రూరల్: మొక్కల పెంపకం ఓ కళ. అందమైన మొక్కలు ఇంటికి అందాన్నే కాదు... మనసుకు ఆనందాన్ని, ఆహ్లాదాన్నిస్తాయి. ఆరోగ్యకరమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి. ఇంటికి వచ్చేవారిని ఆకర్షిస్తాయి. ఇటీవల కాలంలో ఇంటి పెరటిలోనే కాదు.. కార్యాలయాల్లోనూ వివిధ రకాల మొక్కల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. దీనికి అనుగుణంగా వ్యాపారులు స్థానికంగా నర్సరీలు ఏర్పాటుచేసి మొక్కలను విక్రయిస్తున్నారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా గోదావరి జిల్లాల్లోని కడియం నుంచి మొక్కలను తెప్పిస్తున్నారు. రూ.10 నుంచి రూ. 1000లు విలువైన మొక్కల విక్రయం సాగుతోంది. కొందరు పూలమొక్కలతో పాటు కూరగాయల మొక్కల పెంపకంపైనా ఆసక్తి చూపుతున్నారు.

అన్నింటా మొక్కలకే ప్రాధాన్యం

ఆలయాల ప్రారంభోత్సవం, గృహప్రవేశాలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు స్వాగతం ఇలా... ఏ శుభకార్యమైనా పచ్చని మొక్కల వినియోగం ఇటీవల కాలంలో పెరిగింది. కొందరు అధికారులైతే అభినందనలు తెలియజేసేందుకు మొక్కలు పట్టుకుని రావాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొక్కల కొనుగోళ్లు విరివిగా సాగుతున్నాయి. నర్సరీల్లో రోజుకు రూ.50వేల వరకు వ్యాపారం సాగుతున్నట్టు అంచనా. గులాబీ, మందారం, చామంతి మొక్కల విక్రయాలు అధికంగా సాగుతున్నాయి. వీటితోపాటు మనీప్లాంట్, లక్కీ ప్లాంట్, లక్కీబేంబో, డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, తైవాన్ జామ, హైబ్రీడ్ కొబ్బరి, అరటి, బోగనవల్లీ, యాపిల్ తదితర మొక్కలను సైతం కొనుగోలు చేస్తున్నారు. తులసి మొక్క ధర అత్యల్పంగా రూ.10లు కాగా, బోగనవల్లీ మొక్క ధర రూ.1000లు పలుకుతోంది. దాలియా, మల్లి, సన్నజాజి. వంగ, మిరప వంటి మొక్కలను విక్రయిస్తున్నారు. ఆర్‌కే ఫాండ్స్ అనే ఆక్సిజన్ మొక్కలను ఇటీవల ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఈ మొక్కలు ఆక్సిజన్ ఇస్తాయనే అభిప్రాయం అందరిలో ఉంది. దేవాలయాల్లో వేసే ఏక బిల్వం, మహా బిల్వం, మారేడు, ఉసిరి, జమ్మి, శంకు, రుద్రాక్ష, పసుపు గన్నేరుతోపాటు పూజలకు వినియోగించే పలు మొక్కలకు ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుందని నర్సరీ నిర్వాహకులు చెబుతున్నారు.



అదృష్ట చిహ్నంగా పిలువబడే లక్కీప్లాంట్



ఆకట్టుకుంటున్న బోగన వల్లీ



సీజనల్ చామంతులు



అందుబాటులో ఉన్న గులాబీలు

క్లుప్తంగా

సైకిల్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో సత్యనారాయణ మృతదేహం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో సువర్ణముఖీ నది బ్రిడ్జి సమీపంలో సైకిల్‌తో సీతానగరం వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బళ్లకృష్ణాపురం గ్రామానికి చెందిన అక్కేన సత్యనారాయణ(53) శనివారం తామరఖండి రైస్‌మిల్లు నుంచి సైకిల్‌పై సీతానగరం మీ సేవ కేంద్రానికి వస్తుండగా బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వస్తున్న ట్యాంకర్ లారీ సువర్ణముఖీ నది బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో సంఘటన స్థలంలో దుర్మరణం చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గాయపడిన వారిలో ఇద్దరి మృతి

సీతంపేట: మండలంలోని అడలి వ్యూ పాయింట్ సమీపంలో మూడు రోజుల క్రితం ఆటో అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి వేర్వేరు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న వారిలో ఇద్దరు శనివారం మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిలో బూర్జ మండలం కురుంపేట గ్రామానికి చెందిన బొడ్డు యశోదమ్మ(50) శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అలాగే సీతంపేట మండలం వెల్లంగూడకు చెందిన సవర రెల్లియ్య(52) విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడిన వ్యక్తి మృతి

సీతంపేట: మండలంలోని దిగువకారిమాను గూడకు చెందిన సవర బుడ్డయ్య (71) చెట్టు పైనుంచి జారిపడిన సంఘటనలో శనివారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందినట్టు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. శుక్రవారం బిల్లగూడ గ్రామ సమీపంలో ఉన్న ములం చెట్టు ఎక్కి ములంకాడలు తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారిపడడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యసేవల కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాచిపెంట: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటసురేష్ తెలిపిన వివరాలు... గొట్టూరు పంచాయతీ పెదగులిగుద్ది గ్రామానికి చెందిన కొర్ర పాట్టయ్య(40) తన భార్యను రాయిగుడ్డివలస పంచాయతీ పసుకువలస గ్రామంలో ఆమె కన్నవారింట ద్విచక్ర వాహనంపై శనివారం తీసుకువెళ్లి దించాడు. తరువాత తిరుగు ప్రయాణమై ఇంటికి వస్తుండగా ఆరో నంబరు జాతీయ రహదారిపై పూడి జంక్షన్ వద్ద అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు పాట్టయ్యను 108లో సాలూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఈ-హుండీ ప్రారంభం



రామనారాయణం ఆలయంలో ఈ-హుండీని ప్రారంభించిన బ్యాంకు మేనేజర్‌తో ఆలయ కమిటీ సభ్యులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలోని రామనారాయణం ఆలయంలో శనివారం ఐఏబీ బ్యాంకు మేనేజర్ సాహు ఈ-హుండీని ప్రారంభించినట్టు ఆలయ వ్యవస్థాపకుడు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి పరిచే దిశగా వాల్మీకి రీసెర్చ్ సెంటర్, వేద పాఠశాల, 80 అడుగుల ఆంజనేయ విగ్రహంపై రామాయణ ఇతివృత్తాన్ని తెలిపే లేజర్ షోను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ సభ్యులు ప్రణాళిక ప్రకారం భవిష్యత్తులో మరింత రామాయణ గాథను ప్రతీ ఒక్కరికి తెలియజేసేలా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹127	₹224	₹234

ఆరోగ్య ఆసరాకు మంగళం..!

- విజయనగరం పట్టణానికి చెందిన జె.రవి కుమార్ ఈ నెల 4వ తేదీన ప్రాంకియాటీస్ వ్యాధితో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. ఈ నెల 7వ తేదీన డిశ్చార్జ్ అయ్యాడు. ఇతనికి ఆరోగ్య ఆసరా కింద రూ. 3,375 రావాలి.
- విజయనగరంలోని కొత్త మజ్జిపేటకు చెందిన జి.సూర్యనారాయణ 2024 డిసెంబర్ 19వ తేదీన కంటి శస్త్రచికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరాడు. ఇతను కంటి శస్త్రచికిత్స అనంతరం డిసెంబర్ 21న డిశ్చార్జ్ అయ్యాడు. ఇతనికి రూ.1575 ఆరోగ్య ఆసరా కింద రావాల్సి ఉంది.
- ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు మీసాల పెంటమ్మ. ఈమెది గరివిడి మండలం కె.పాలవలస గ్రామం. ఈమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో 2024 డిసెంబర్ 28వ తేదీన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరింది. చికిత్స అనంతరం శనివారం డిశ్చార్జ్ అయింది. ఈమెకు రూ.30 వేలు ఆరోగ్య ఆసరా క్రింద రావాల్సి ఉంది. అయితే ఆరోగ్య ఆసరా నిధులు ఇవ్వకపోవడంతో ఈమెకు ఆసరా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.





ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ రోగిని డిశ్చార్జ్ చేస్తున్న వైద్యులు

- ఆసరా లబ్ధిదారులకు నిధులు విడుదల చేయని కూటమి సర్కార్
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రోగి డిశార్జి అయిన 48 గంటల్లో ఆసరా చెల్లింపు
- రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఆసరా బకాయిలు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో వేలాది మంది ఆరోగ్య ఆసరా కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ), ఆరోగ్య ఆసరా పథకాల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం స్థానంలో బీమా కంపెనీ తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ఆరోగ్య ఆసరా పథకానికి అయితే నిధులు విడుదల చేయడం లేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిధులు విడుదల చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య ఆసరా పథకానికి కూటమి సర్కార్ మంగళం పాడేసిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందువల్ల నిధులు విడుదల చేయకుండా కూటమి సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలొస్తున్నాయి.

గతంలో 48 గంటల్లో ఆసరా చెల్లింపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్య ఆసరా పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం కింద ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు, చికిత్స చేసుకున్న వారికి చికిత్స అనంతరం భృతి చెల్లించారు. రోగి డిశ్చార్జ్ అయిన 48 గంటల్లో రోగి బ్యాంకు ఖాతాకు ఆసరా చెల్లించేవారు. శస్త్రచికిత్స గాని, చికిత్స చేయించుకోవడం వల్ల వారు కొన్ని నెలల పాటు ఎటువంటి పని చేయలేరు. ఇటువంటి తరుణంలో వారికి ఎటువంటి ఉపాధి ఉండదు. ఈ తరుణంలో కుటుంబ పోషణతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవడం కోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆరోగ్య ఆసరా కోసం భృతిని చెల్లించేది.

వాస్తవమే..

> ఆరోగ్య ఆసరా నిధులు విడుదల కొంత కాలంగా విడుదల కాని మాట వాస్తవమే.. ఈ విషయమై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుంది.
>
> – డాక్టర్ కొయ్యాన అప్పారావు, ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి కో ఆర్డినేటర్

1619 వ్యాధులకు విశ్రాంత భృతి

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 1619 వ్యాధులకు ఆరోగ్య ఆసరా పథకాన్ని వర్తింపజేసేవారు. ఈ పథకంలో భాగంగా ఆపరేషన్ కోసం రోగి చేరిన వెంటనే ఆరోగ్యమిత్ర రోగి బ్యాంక్ అకౌంట్ నంబరును రిజిస్టర్ చేసేవారు. ఆసరా రాకపోవడం వల్ల ఇప్పుడు బ్యాంక్ వివరాలు తీసుకోవడం మానేసారనే తెలుస్తోంది.

వేలాది మంది ఎదురుచూపులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 33 ఉన్నాయి. వీటిల్లో నిత్యం అధిక సంఖ్యలో రోగులు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేరి చికిత్స చేయించుకుంటారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స, శస్త్రచికిత్స చేసుకున్న వారికి గత 6 నెలలుగా ఆసరా డబ్బులు కావడం లేదు. ఆరోగ్య ఆసరా కోసం వేలాది మంది ఎదురు చూస్తున్నారు. సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఆసరా డబ్బులు రావాల్సి ఉంది.

కోడి పందాల శిబిరంపై దాడి

బొండపల్లి: కోడి పందాలు నిర్వహిస్తున్న శిబిరాలపై దాడి చేసి 8 కోడి పుంజులతో పాటు 8 మంది వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ యు.మహేష్ శనివారం తెలిపారు. కొత్తపాలెంలో 6 కోడి పుంజులు, ఆరుగురు వ్యక్తులతో పాటు వారి నుంచి రూ.8,900 నగదు, గొట్లాంలో 2 కోడి పుంజులు, ఇద్దరు వ్యక్తులతో పాటు రూ.1400 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హోటల్ గదిలో యువకుని మృతి

శృంగవరపుకోట: హోటల్ గదిలో యువకుని మృతి కొత్తవలస పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కొత్తవలస పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్న స్టార్ రూమ్స్ హోటల్లో విశాఖపట్నం విమాన్‌నగర్‌కు చెందిన యువకుడు బస చేశాడు. కాగా శనివారం సాయంత్రం హోటల్ సిబ్బంది తమ హోటల్ గదిలో యువకుడు ఉరి వేసుకుని మరణించినట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ షణ్ముఖరావు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు విమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన జీవన్‌శర్మగా గుర్తించారు. మృతుని కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. కాగా యువకుని మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



హోటల్ గదిలో ఉరి వేసుకొని విగతజీవిగా ఉన్న జీవన్‌శర్మ

డీఎస్పీ శ్రీనివాసరావుకు బదిలీ

బొబ్బిలి: డివిజనల్ పోలీసు అధికారి పి.శ్రీనివాసరావుకు నర్సీపట్నం బదిలీ అయింది. ఈయన స్థానంలో భవ్యారెడ్డి నియామకం అయినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

బంగారు వెండి ఆభరణాల చోరీ

బొబ్బిలి: సంక్రాంతి పండగకు స్వగ్రామాలకు కుటుంబ సభ్యులు వెళ్లిన నేపథ్యంలో పట్టణంలోని దాడితల్లి కాలనీలో రెండు ఇళ్లలో దొంగలు చొరబడి బంగారు, వెండి అభరణాలు దొంగిలించారు. మరిశర్ల సింహాచలం అనే ఉపాధ్యాయుడి ఇంట్లో దూరి కిలో వెండి, తులంన్నర బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. అదే కాలనీలో ఉంటున్న గొట్టాపు వేణు అనే కాజా కళాశాల అధ్యాపకుడి ఇంట్లో 350 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదును అనుసరించి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు.

సజావుగా కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ



ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీలు

విజయనగరం క్రైమ్: స్టైపెండరీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు 13వ రోజు శనివారం పరేడ్ గ్రౌండ్‌లో పీఎంటీ, పీఈటీ పరీక్షలను నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందల్ స్వీయ పర్యవేక్షణ చేశారు. 600 మంది అభ్యర్థులకుగానూ 517మంది హాజరయ్యారని, వారిలో 370 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షలకు అర్హత సాధించారన్నారు. నియామకాల ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావులు పర్యవేక్షించారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థిని పరిశీలిస్తున్న ఎస్పీ

ఇరు వర్గాల ఘర్షణలో పది మందికి గాయాలు



గజపతినగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ఒకరి పరిస్థితి విషమం

దత్తిరాజేరు: మండలంలోని చినచామాలాపల్లిలో ఇరువర్గాల మధ్య శనివారం ఉదయం జరిగిన ఘర్షణలో పది మంది గాయపడినట్టు పెదమానాపురం ఎస్‌ఐ జయంతి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. శుక్రవారం గ్రామంలో క్రికెట్ ఆడుతుండగా చెలరేగిన వివాదం నేపథ్యంలో ఒక వర్గం అమ్మాయిలపై అసభ్య మెసేజీలు పెట్టారని వేరే వర్గం ప్రశ్నించడం ఈ క్రమంలో వివాదం పెద్దదై ఇరు వర్గాల వారు కర్రలతో కొట్లాడుకున్నారని తెలిపారు. దీంతో మన్యాల అప్పలస్వామి, తిరుపతి, మన్యాల సత్యం, మన్యాల నర్సయ్య, తమడ గణేష్, దుర్గారావు, డి.శ్రీను, వెంకటరమణతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయని తెలిపారు. వీరు గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నట్టు తెలిపారు. కొట్లాట నేపథ్యంలో గ్రామాన్ని గజపతినగరం సీఐ జీఏవీ రమణ సందర్శించారు. వివాదానికి కారణమైన పది మంది యువకులను, వారి బైక్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట బొండపల్లి, ఎస్.భూర్జవలస ఎస్‌ఐలు మహేష్, రాజేష్ ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రమణ

పీడీఎస్ బియ్యం పట్టివేత

పార్వతీపురం: బొబ్బిలి నుంచి జిమిడిపేట డీఎంయూ ట్రైన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ ఎం.రాజేంద్ర తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు డీఎంయూ ట్రైన్‌లో ఏడు ప్లాస్టిక్ సంచుల్లో 2.20కిలోల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా శనివారం పట్టుకున్నట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని విక్రయించిన, కొనుగోలు చేసిన, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.



పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న సీఎస్‌డీటీ రాజేంద్ర తదితరులు

అనుమానం రాకుండా.. కేజీంపావు బంగారం కొట్టేశారు

- ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు
- 32 చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- 104 తులాల బంగారు ఆభరణాలు రికవరీ



రికవరీ చేసుకున్న సొత్తు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, చిత్రంలో డీఎస్పీ వివేకానంద, సీఐలు, ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్: దొంగలొచ్చారన్న విషయం ఇంటి తలుపులకే తెలియదు.. తాళాలకు సుత్తిదెబ్బలూ ఉండవు.. రాళ్ల దెబ్బలూ పడవు.. కిటికీలు, గ్రిల్స్ తొలగించిన దాఖలాలు కనబడవు.. దర్జాగా ఇంటి తాళం ఎక్కడుందో ముందే తెలుసుకుని లోపలికి వెళ్తారు.. బీరువాలో వస్తువులు చిందరవందరగా పడేయకుండా ఎన్ని బంగారు వస్తువులున్నా ఒక ట్రెండే తమ లక్ష్యమన్నట్లు.. మూడో కంటికి తెలియకుండా ఏడాది వ్యవధిలో 32 చోరీలకు పాల్పడ్డారు ఇద్దరు యువకులు. మొత్తం 112 తులాల బంగారాన్ని కాజేశారు. ఈ చోరీల ప్రణాళికలో విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన పున్నాన రాంబాబు (30)ది మాస్టర్ మైండ్ కాగా, మన జిల్లాలోని జి.సిగడాం మండలం గెద్ద కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావు (33) భాగస్వామిగా ఉన్నాడు. జైలు గోడల మధ్య పరిచయమైన వీరి బంధం మళ్లీ అక్కడికే తీసుకెళ్లేలా చేసింది. రూ.84.44 లక్షల విలువైన 104 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు.

రంజీ జట్టు ఎంపికలో మోసపోవడంతో..

పున్నాన రాంబాబు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విజయవాడలోని తన అత్తగారింటి వద్ద చదువుకున్నాడు. మొబైల్ అప్లికేషన్లు, హార్డ్‌వేర్ వంటి సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యాన్ని సంపాదించుకున్నాడు. చిన్నప్పటినుంచి క్రికెట్‌పైన మక్కువ ఉండటంతో అక్కడే ఓ కోచ్ వద్ద మెలకువలు సాధించాడు. అయితే రంజీ జట్టుకు ఎంపిక విషయంలో కోచ్ తనను మోసం చేయడం తట్టుకోలేని రాంబాబు వ్యసనాల బాట పట్టాడు. క్రికెట్ బెట్టింగ్ కోసం డబ్బులు దుబారాగా ఖర్చుపెట్టడం.. అది కాస్తా ఆస్తి నేరాలు చేసేలా దారి తీసింది. ఈ క్రమంలో ఎస్.కోట, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరు తదితర పోలీస్ స్టేషన్లలో గతంలో నమోదైన 30 కేసుల్లో అరెస్టయి జ్యుడీషియల్ రిమాండ్‌కు కూడా వెళ్లాడు.

జైలులో కోటేశ్వరరావుతో పరిచయం

రెండో నిందితుడైన గిడిజాల కోటేశ్వరరావు స్వగ్రామం జి.సిగడాం మండలం గెద్ద కంచరాం. శ్రీకాకుళంలో ఉండేవాడు. భార్య భరణం కేసులో 2021లో అరెస్టయి శ్రీకాకుళం జైలుకు వెళ్లినప్పుడు అక్కడే ఉన్న రాంబాబుతో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి విడుదలయ్యాక తనతో పాటు నేరాల్లో పాలుపంచుకోవడానికి ప్రణాళిక వేసుకున్నాడు. రాంబాబు దొంగిలించిన సొత్తును ముత్తూట్ ఫిన్‌కార్ప్, ముత్తూట్ మినీ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టడానికి కోటేశ్వరరావుకు ఇచ్చేవాడు. దానికి కమీషన్‌గా వచ్చే డబ్బుల్లో పదిశాతం వాటా ఇచ్చేవాడు. కొన్ని నేరాల్లో కోటేశ్వరరావు కూడా పాల్గొనేవాడు.

ఏడాది వ్యవధిలో 32 చోరీలు..

ఈ క్రమంలో 2024 నుంచి 2025 వరకు శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో 32 చోరీలు చేశారు. ఎచ్చెర్ల పీఎస్ పరిధిలో 11 చోరీలు, లావేరు పీఎస్ మూడు, శ్రీకాకుళం ఒకటో పట్టణ పీఎస్ నాలుగు, శ్రీకాకుళం రూరల్ పీఎస్ రెండు, గార పీఎస్ రెండు, శ్రీకాకుళం రెండో పట్టణ పీఎస్ నాలుగు, పొందూరు పీఎస్ మూడు, పోలాకి పీఎస్ ఒకటి, విశాఖజిల్లా పీఎం పాలెం పీఎస్ ఒకటి, వీఎస్పీ సిటీ ఒకటి చేశారు. వీరు చేసిన చోరీలన్నీ బంగారు వస్తువులే కావడం గమనార్హం.

ఎచ్చెర్ల చోరీ కేసు తీగ లాగితే..

2024 డిసెంబరులో ఎచ్చెర్లలో ఫంక్షన్ కోసం వెళ్తున్న కుమార్తెకు తన తల్లి బీరువాలో భద్రపర్చిన ఐదున్నర తులాల బంగారు కాసుల పేరు, చైన్ ఇచ్చింది. తిరిగొచ్చాక మళ్లీ పెట్టేసింది. పండగ సందర్భంగా ఇల్లు శుభ్రం చేద్దామని ఈ నెల 7న బీరువా తెరవగా రెండు నగలూ కనిపించలేదు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ సందీప్ దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అనేక విషయాలు బయటపడుతుండటంతో డీఎస్పీ సిహెచ్ వివేకానంద పర్యవేక్షణలో జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఒకటో పట్టణ సీఐ సీహెచ్ పైడపునాయుడులతో కూడిన బృందాలు దర్యాప్తు ముమ్మరం చేయడంతో మరిన్ని విషయాలు బయటపడ్డాయి. 2022లో అరెస్టయి విశాఖపట్నం సెంట్రల్ జైల్‌కు వెళ్లిన రాంబాబు మళ్లీ 2024 జనవరి 10న విడుదలైన మరొకరి సాయంతో ఈ నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు.

పట్టుబడ్డారిలా..

ఈ నెల 17న సాయంత్రం తమకొచ్చిన సమాచారంతో ఎచ్చెర్ల, లావేరు ఎస్‌ఐలు సందీప్‌కుమార్, చిరంజీవిలు సిబ్బందితో కలిసి అరిణం అక్కివలస కూడలిలోని ప్రకృతి లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా పలు ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. ఇంటి ఆవరణలోని షూర్యాక్, ఎలక్ట్రికల్ మీటర్ రీడింగ్‌బోర్డు, పూల కుండీలు, కిటికీలోపల తదితర చోట్ల తాళాలు పెట్టే వారి ఇళ్లే వీరి లక్ష్యం. ఇంట్లో వారికి అనుమానం రాకుండా లోపల కూడా నాలుగైదు తులాలకు మించి ఎప్పుడూ దొంగతనాలు చేయలేదు.

ఎక్కడా వేలిముద్రలు పడకుండా జాగ్రత్తపడేవారు

పోలీసులు వచ్చి చెప్పేవరకు తమ ఇంట్లో దొంగతనం జరిగిందని బాధితులకే తెలియకపోవడం గమనార్హం. ఒకటి రెండు వస్తువులే తీయడంతో కుటుంబంలోని వారు ఇంటిదొంగ పని అని భావించేలా..ఎవరో ఒకరు దొంగతనం చేసినట్లు.. భావించి పలు ఇళ్లల్లో కొట్లాటలు కూడా జరిగినట్లు సమాచారం.

ప్రతిభకు ప్రశంసలు..

భారీ కేసును డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో ఛేదించిన సీఐలు ఎం.అవతారం, సీహెచ్ పైడపునాయుడు, ఎస్‌ఐలు సందీప్‌కుమార్, చిరంజీవి, జి.లక్ష్మణరావు, సిహెచ్ మధుసూదనరావు, మిగతా సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు కూడా నిర్లక్ష్యం వహించకుండా తాళాలను తమ వెంటే తీసుకెళ్లాలని, బయట ఉంచకూడదని సూచించారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో మిగిలిన ఎనిమిది తులాల బంగారాన్ని రికవరీ చేసే పనిలో ఉన్నట్లు చెప్పారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ Plot selling at Gajapati nagaram in Bonda palli (V), Plot No. 45, Opposit Akhara Polytechnique college just very near Bobbili high way. Contact Krishna murthy No. 8331831892, Venkata Ramana 91 95055 30473. [SCA25001185]

■ విశాఖపట్నం South Coast రైల్వే జోన్ పరిధిలో VMRDA / RERA ఇంటిస్థలం అమ్మకం. బ్యాంక్‌లోన్ సదుపాయం. ఫోన్ : 94932 44471, 93969 72239 [V- 2082]

LAND FOR SALE

■ విజయనగరం జిల్లా రాజాం సిటీకి దగ్గరలో ఆరసాడ (M), ఒప్పంగి గ్రామం నందు 102 ఎకరాలు భూమి అమ్మకంకు కలదు. సుమారు 50 ఎకరాలు మామిడి తోట, వరి, మిర్చి, చెరుకు పంటలకు సౌకర్యంగా ఉండును. సెల్: 9440495377, 7794995377 [SCA25001172]

REAL ESTATE

■ గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్, ఇన్నర్ రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ,మంగళగిరి,తాడికొండ,రాజధానిలోని ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్రః 9948779955 [G-9877]

HEALTH CARE

■ డాః నిర్మాల వంగపండు MD, Gen, Med (DM-Neuro) Jimper మెదడు, నరములు, వెన్నెముక వ్యాధి నిపుణులు. ఆదివారం నుండి శుక్రవారం వరకు 9am to 6pm చూసెదరు. నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్, VZM, Appointment . ఫోన్ : 63054 71147 [V- 1980]

ASTROLOGY

■ ICAS ఇండియన కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రాలజికల్ సైన్సెస్ వారిచే జ్యోతిష్యంలో డిప్లమో కోర్సులు నేర్పించబడును. అడ్మిషన్లు ప్రారంభము. Ct. : సెంట్రల్ స్కూల్, బాలాజీ నగర్, VZM. ఫోన్ : 99666 66659, 93947 89246 [V- 7766]

WANTED

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ. 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244 [B-1172677]

■ పూసపాటిరేగ, కోనాడ జంక్షన్ వద్ద గల లంక సుజికీ 2 వీలర్ షోరూం లో పనిచేయుటకు అనుభవం కలిగిన సేల్స్ & సర్వీస్ ఎగ్జిక్యూటివ్స్ మరియు టెక్నీషియన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సెల్: 9014944489 [SCA25001218]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177 [B-1266957]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1266954]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ : 18K. Ph: 9160900024, 9640400073, [SCA25001195]

■ కష్టలెస్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999 [HA-99571]

■ హైదరాబాద్, చేవెళ్ల కాలేజ్‌లో ఉంటూ పనిచేయడానికి భార్యాభర్తలు కావలెను. జీతం : 15000+వసతి. Ph: 8919737607/8328443702 [SCA25001162]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు,భార్యాభర్తలు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-15309]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.